రంజాన్ వేళలు
ఇఫ్తార్(ఆదివారం)-6:33
సహర్ (సోమవారం)-5:04

ఇరువర్గాల మధ్య ఘర్షణలో
12 మందిపై కేసు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ కల్యాణ్‌కుమార్
5



గద్వాల జనరల్ ఆస్పత్రిలో డైనింగ్ హాల్ లేకపోవడంతో రోగుల సహాయకులు చెట్ల కిందనే భోజనాలు చేస్తున్నారు. ఆరేళ్ల కిందట డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరైనా నిర్మించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి.



గద్వాల జనరల్ ఆస్పత్రిలో అటెండర్లు లేకపోవడంతో రోగుల బంధువులే అటెండర్లుగా మారారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ఆస్పత్రిని సందర్శించినప్పుడు ఒక రోగిని బంధువులే స్ట్రెచర్‌పై ఉంచి తీసుకెళ్లడం కనిపించింది.

ఆంధ్రజ్యోతి విజిట్

ధర్మాస్పత్రి.. దయనీయం

- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- తాగేందుకు నీళ్లు కరువు
- మహబూబ్‌నగర్, గద్వాలలో పని చేయని ఫ్యాన్లు
- గద్వాలలో ఓపీ రూమ్‌ల కొరతతో డాక్టర్ల అవస్థ
- పాలమూరులో స్కానింగ్ కోసం గంటల తరబడి క్యూ
- వనపర్తిలో రోగుల సహాయకులకు చెట్లే దిక్కు
- సరిపడా లేని స్ట్రెచర్లు, వీల్‌చైర్లు
- నారాయణపేటలో మరుగుదొడ్లకు లేని తలుపులు
- రోగుల సహాయకులకు ఇవ్వని భోజనం

జనరల్ ఆస్పత్రుల్లో రోగులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎటు చూసినా అపరిశుభ్రత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దుర్గంధం ముక్కుపుటలను అదరగొడుతోంది. తాగడానికి నీళ్లు ఉండవు.. కూర్చోవడానికి కుర్చీలు లేవు.. చాలీచాలని మరుగుదొడ్లు.. ఫ్యాన్లు లేక ఉక్కపోత.. ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యల చిట్టా చాలా ఉంది. పేరుకే పెద్దాస్పత్రులు కాగా, సౌకర్యాల్లో దయనీయంగా ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల జనరల్ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆయా దవాఖానాలను 'ఆంధ్రజ్యోతి' శనివారం పరిశీలించగా ఆ సమస్యలు వెలుగు చూశాయి.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

5

మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ల కొరతతో స్కానింగ్ కోసం రోగులు గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ రోజుకు 40 మందికి మాత్రమే చేస్తుండటంతో రోగులు ఉదయం ఆరు గంటలకే టోకెన్ కోసం వస్తున్నారు.





మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఫ్యాను లేకపోవడంతో ఉక్కపోత భరించ లేక ఇంటి నుంచి ఫ్యాను తెచ్చి పెట్టుకున్న ఓ రోగి

యునెస్కో గుర్తింపు కోసం
తొలి అడుగు

- భారత్ తరపున తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న నిలువురాళ్లు
- చారిత్రక నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం చాలా మంది ప్రయత్నం
- గుర్తింపుతో.. ప్రాంత అభివృద్ధి, దేశ, విదేశీ టూరిస్టులను ఆకర్షించే అవకాశం
- రాళ్ల నీడతో సమయంతో పాటు వాతావరణ పరిస్థితిపై అంచనాలు తయారీ
- ఆల్చిన్ పరిశోధనతో వెలుగులోకి, టిటా సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్రచారం
- క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల నాటి చారిత్రక సంపదగా వీటికి గుర్తింపు

మహబూబ్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చారిత్రక నేపథ్యం ఉండి నీడను బట్టి సమయాన్ని తెలియజేసి సూర్యుడి గమనాన్ని బట్టి వాతావరణ పరిస్థితులను అంచనా వేసేందుకు ఉపయోగించిన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు లభించేందుకు తొలి అడుగుపడింది. భారత్ తరపున యునెస్కో గుర్తింపు కోసం పంపించే తాత్కాలిక జాబితాలో వీటికి చోటు లభించింది. చాలా కాలంగా ముడుమాల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు లభించడం కోసం పలు సంస్థలు, పురాతత్వ శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే తరహా నిర్మాణాలు ఉన్న ఇంగ్లాండ్‌లోని విల్‌షైర్ ప్రాంతంలోని స్టోన్‌హెంజ్‌కు ఎప్పుడో ప్రపంచ వారసత్వ సంపదలో చోటుదక్కగా నిలువురాళ్లకు చోటు దక్కలేదు. 1980 సంవత్సరంలోనే వీటి ప్రత్యేకత వెలుగులోకి రాగా చాలామంది పురాతత్వ శాస్త్రవేత్తలు, సామాజిక వేత్తలు వీటిపై పరిశోధనలు చేశారు. అప్పటి నుంచి

(మిగతా 4లో..)



ముడుమాల్‌లోని నిలువు రాళ్లు

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



వనపర్తిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

4

ఉండవల్లిలో అఘోరీ హల్‌చల్

- అలంపూరు వెళ్తానని భీష్మించిన అఘోరీ
- జోగులాంబ ఆలయ పరిసరాలలో ఉన్న దర్గాను తొలగించాలని డిమాండ్
- వివాదాస్పద ప్రకటనతో అడ్డుకున్న పోలీసులు
- కారులో ఉండగానే టోయింగ్ వాహనంతో హైదరాబాదు వైపు తరలింపు

వీడని నిర్లక్ష్యం

- ఐదేళ్లుగా పట్టణాల్లో నిలిచిన తైబజార్ వసూళ్లు
- దాదాపు రూ.2కోట్ల ఆదాయం కోల్పోయిన గద్వాల మునిసిపాలిటీ
- అరకొరగా వసూలు చేస్తున్న వడ్డేపల్లి మునిసిపల్ సిబ్బంది
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు



గద్వాల పట్టణంలో తోపుడు బండ్లపై సాగుతున్న వ్యాపారం

అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఐదేళ్లుగా జోగులాంబ గద్వాల జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో తైబజార్ వసూళ్లు నిలిచిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో దాదాపు గద్వాల ఒక్క మునిసిపాలిటీ రూ.2 కోట్లకు పైగా ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. అలంపూర్, వడ్డేపల్లిలో మాత్రం మునిసిపల్ సిబ్బంది అరకొరగా వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని మునిసిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నందున స్థానికంగా లభించే ఆదాయంపై అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- గద్వాల టౌన్, ఆంధ్రజ్యోతి

4

సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయం

- జామె మసీదు అభివృద్ధికి రూ.50 లక్షలు
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.6 వేల కోట్లు
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి
- జిల్లా కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు

నాగర్ కర్నూల్‌టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ సామాజిక న్యాయం పాటించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి జూపల్లి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంపీ మల్లు రవి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మసీదు ఇమామ్, హఫీజ్, మౌజన్‌లను ఎంపీ మల్లురవి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ జామెమసీదు అభివృద్ధి కోసం సాంస్కృతికశాఖ నుంచి రూ.50 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీ వర్గాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.6 వేల కోట్ల నిధులు మంజూరీ చేసిందన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువతకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్, నాయకులు మహ్మద్ ఇర్ఫాన్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కనుల పండువగా వెంకన్న కల్యాణం

బిజినేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి ఆలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వెంకన్న కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినే పల్లి మండలం వట్టెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు జిలకర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు వైభవంగా నిర్వహించారు. శ్రీవారి తరుపున ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్ రెడ్డి, ఉప్పల కృష్ణయ్య దంపతులు, అమ్మవారి పక్షాన దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నరసింహారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి, బల్మూరు కొండల్ బృందం, వట్టెం భజన బృందాల ఆధ్వర్యంలో కళాకారుల కీర్తనలు అలరించాయి. కల్యాణోత్సవంలో సందడి నరేందర్‌రెడ్డి, సందడి రాంచంద్రారెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గుబ్బ సత్యనారాయణ కొర్త చంద్రారెడ్డి, వడ్ల భాస్కరాచారి, అనంత అశోక్, కృష్ణ, భూపాల్, జక్కాల్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మంగల సూత్రాన్ని చూపుతున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

క్రీడలతో బంగారు భవిష్యత్

- జిల్లా అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌కుమార్



అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 23న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్ - 14, 16, 18, 20 సంవత్సరాల్లోపు బాల, బాలికల, మహిళ, పురుషుల జట్ల ఎంపికలను శనివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు సీ.శ్రీనివాసులు, పీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- గోవింద నామస్మరణతో మార్మోగిన కందూరు



స్వామి వారి రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

మూసాపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవం వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. అంతకుముందు ఆలయ అర్చకులు నిత్యోపాసన, రుద్రాభిషేకం, బలిహరణ, రథాంగ హోమాలు, మహాన్యాస పూర్వ ఏకాదశ, రుద్రహోమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి గోవింద నామస్మరణతో స్వామి వారి రథాన్ని ఆ లయం నుంచి గ్రామం వరకు లాగి, అక్కడి నుంచి తిరిగి ఆల యానికి తీసుకొచ్చారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఈవో రాజేశ్వర్‌శర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, రవీందర్‌శర్మ, అనంతసేన్‌శర్మ, బుచ్చన్నగౌడ్, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, దేవన్నయాదవ్, శ్రీనివాసులు, ఆంజనేయులు, మనోహర్ పాల్గొన్నారు.

సౌర విద్యుత్ పనుల్లో వేగం పెంచాలి

- టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ శివాజీ



సోలార్ పలకలను పరిశీలిస్తున్న శివాజీ

వంగూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో సోలార్ విద్యుత్ పనులను వేగవంతం చేసి ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని టీజీ ఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ శివాజీ అన్నారు. శనివారం వంగూరు మండలం సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్లి, గ్రామంలో జరుగుతున్న సోలార్ విద్యుత్ పనులను పరిశీలించారు. వినియోగదారుల ఇళ్లు, పొలాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పలకలను పరిశీలించి, వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో శివాజీ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 499 కనెక్షన్లగాను 405 పూర్తి చేశారని, 79 కనెక్షన్లకు రూఫ్ టాప్ లేదని, ఆ ఇళ్లలో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సౌర విద్యుత్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఉపయోగించుకొని మిగిలితే విక్రయించి ఆదాయం పొందొచ్చన్నారు. ఇళ్లకు 1 నుంచి 3 కిలో వాట్స్ పొలాలకు 5 కిలో వాట్స్ సామర్థ్యం గల సౌరపలకలను ఉచితంగా ఏర్పాటు చేశారని, కనెక్షన్‌కు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందన్నారు. గ్రామంలో సౌర విద్యుత్ పనులు తుది దశకు చేరుకున్నాయని, మరి కొద్ది రోజుల్లో వినియోగదారుల ఇళ్లలో, పొలాల్లో సౌరవిద్యుత్ వెలుగులు వెలిగింపజేస్తామన్నారు. విద్యుత్ ఏడీఈ శంకరయ్య, ఏఈ మేఘనాథ్, ప్రత్యేక అధికారి విజయ్ కుమార్, వేమారెడ్డి పాల్గొన్నారు.

వీడని నిర్లక్ష్యం

» ఐదేళ్లుగా నిలిచిన తైబజార్ వసూళ్లు



గద్వాల పట్టణ మునిసిపల్ కార్యాలయం

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలకు స్థానికంగా లభించే ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి తైబజార్.. గడచిన ఐదేళ్లుగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని పట్టణ, మునిసిపాలిటీల్లో తైబజార్ వసూళ్లు నిలిచిపోయాయి. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో ఇదే పరిస్థితి. వడ్డేపల్లిలో మాత్రం మునిసిపల్ కార్యాలయం సిబ్బంది అరకొరగా వసూళ్లు చేస్తున్నారు. గద్వాల పట్టణంలో 2019-20 ఆర్థిక సంవత్సరంలో నెలకొన్న తైబజార్ వేలం సందిగ్ధత, అనంతరం ఎదురైన కరోనా సంక్షోభంలో అర్ధాంతరంగా నిలిచిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఐదేళ్ల పాటు తైబజార్ వేలం నిలిచిపోవడంతో మునిసిపాలిటీకి రావాల్సిన దాదాపు రూ.2కోట్లకు పైగా గండి పడింది. ఇదే పరిస్థితి మరో ప్రధాన పట్టణమైన అయిజలోనూ ఉంది. 2020లో కొత్తగా ఏర్పడిన రెండు మునిసిపాలిటీలు అలంపూర్, వడ్డేపల్లిలో మాత్రం తైబజార్ వసూళ్లు అరకొరగా చేస్తున్నారు.

గద్వాల పట్టణంలో ప్రతీ ఏడాది వసూలు చేసే తైబజార్ పన్నుల జాబితాలో 2019 వరకు కూరగాయల మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారం కూడా ఉండేది. దాని ద్వారానే కాంట్రాక్టర్‌కు అధిక ఆదాయం సమకూరేది. 2021లో కూరగాయల హోల్‌సేల్ వ్యాపారాన్ని గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోకి మార్చడంతో వ్యాపారులు తైబజార్ చెల్లించడం నిలిపివేశారు. దీంతో కూరగాయల మార్కెట్ ఆదాయాన్ని మినహాయించి వేలం పాట నిర్వహించాలని కాంట్రాక్టర్లు కోరుతుండగా, మునిసిపల్ అధికారులు అంగీకరించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతీ ఏడాది నిర్వహించే వేలం సొమ్మును అంతకు పూర్వం బిడ్డు ఆధారంగా ఖరారు చేయాల్సి ఉంటుందని, తగ్గింపు జరిగితే ఉన్నతాధికారుల అనుమతి పొందాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఎటూ తేల్చుకోలేని కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదు. అయిజ పట్టణంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో సాధారణ బజార్‌లో రూ.38లక్షలు, కూరగాయల మార్కెట్‌కు సంబంధించి రూ.20లక్షలు మొత్తం రూ.58 లక్షలుగా ఉన్న తైబజార్ వేలం మధ్యలోనే నిలిపివేశారు. నాలుగేళ్లు దాటినా తైబజార్ వేలం పునరుద్ధరణపై పాలక మండలి ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో రెండు ప్రధాన పట్టణాలకు రావాల్సిన ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పండింది.

అలంపూర్ పట్టణానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3.39 లక్షలతో వేలం నిర్వహించారు. అధికారులు ప్రతీ నెల రూ.33వేల చొప్పున వసూలు చేశారు. ఈ ఏడాది 2025-26 ఆర్థికం సంవత్సరానికి సంబంధించి రూ.3.99లక్షలుగా తైజబార్ వేలం ధరను నిర్ణయించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. వడ్డేపల్లిలో ఇప్పటి వరకు తైబజార్ వేలానికి సంబంధించి పాలక మండలి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అధికారులు మాత్రం తమ సిబ్బంది ద్వారానే అరొకరగా (రూ.1500ల నుంచి రూ.2వేల) వసూలు చేయిస్తున్నారు. ఈ ఏడాది నాలుగు మునిసిపాలిటీల్లో తైబజార్ వేలం వసూళ్ల కోసం తగిన ప్రణాళిక సిద్ధం చేస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అన్ని మునిసిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నందున స్థానికంగా లభించే ఆదాయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత ఎదురవుతుందటూ చెప్పే పాలకులు విధిగా వచ్చే ఆదాయాలపై దృష్టి సారించక పోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖారుతో ముగియనుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలోనైనా తైజబార్ వేలం నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

త్వరలోనే తగిన నిర్ణయం

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో తైబజార్ వేలానికి సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. ఆయా పట్టణాల్లో నెలకొన్న పరిస్థితులు, వాస్తవంగా లభించే ఆదాయం, ఇతరత్రా సమస్యలపై వారం రోజుల్లోగా మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌వోలతో సమావేశం నిర్వహించి విషయాన్ని కలెక్టర్, దృష్టికి తీసుకువెళ్తాం. ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

- అదనపు కలెక్టర్, నర్సింగరావు

నల్గొండకు నీటి తరలింపును ఆపాలి

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

కల్వకుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ) పరిధిలోని ఏదుల రిజర్వాయర్ నుంచి నల్గొండ జిల్లాకు నీటిని తరలించడాన్ని జిల్లా ఎమ్మెల్యేలు ఆపాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్, న్యాయవాది వెంకట్‌గౌడ్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాఘవాచారి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జిల్లాలో సాగునీరందించేందుకు ఎందుకు కలిసి పని చేయడం లేదని ప్రశ్నించారు. మనకు దక్కాల్సిన సాగునీటిని తరలించుకుపోతున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీరందించే వారు మన జిల్లా వాసి సీఎం రేవంత్‌రెడ్డేనని, ప్రభుత్వంతో కొట్లాడే పార్టీ కార్యదర్శి జాన్‌వెస్లీ మన జిల్లా వాసేనని పేర్కొన్నారు. ఒకే జిల్లాకు చెం దిన నేతలున్నప్పటికీ పాలమూరుకు ఎందుకు అన్యాయం జ రుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ కింద నీటి విడుదల వల్ల నల్గొండ జిల్లా ఆ ప్రాంతం సస్యశ్యామల మైందని గుర్తు చేశారు. పీఆర్ఎల్ఐ నీటిని డిండి ప్రాజెక్టుకు తరలిస్తే పాలమూరు కింద 12లక్షల ఎకరాలకు సాగునీరందిం చడం సాధ్యం కాదని అన్నారు. ఇప్పటికైనా ఉమ్మడి పాలమూ రు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏకతాటిపై ముందు కు సాగి నల్గొండకు తరలించనున్న నీటిని ఆపివేయాలని ఆయన కోరారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు రాఘవాచారి తెలిపారు.

విలేకర్ల సమావేశంలో పాలమూరు అధ్యయ న వేదిక నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్, బీసీ సబ్ ప్లాన్ తాలుకా అధ్యక్షుడు రాజేందర్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాగా, కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన చంద్రశే ఖర్‌రెడ్డి అతని భార్య కవిత కుటుంబం బలి కావడం ఇది వ్య వస్థాగతమైన హత్యేనని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. ఈ హత్యకు ప్రభు త్వం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ దోపిడీ వ్యవస్థలో ఇలాంటి సంక్షోభం నుంచి బయటకు తీసుకురావాల్సినవ సరం ప్రభుత్వంపై ఉందన్నారు. పరామర్శించిన వారిలో వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



గద్వాల జ్ఞానప్రభ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

గద్వాల సర్కిల్/వనపర్తి రూరల్/నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో 8వ రోజు శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవ త్సరం పరీక్షకు 98 శాతం విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు.

3,141 మందికి గాను 3,063 మం ది హాజరయ్యారు. వీరిలో జనరల్ 2,416, వృత్తి విద్య 647 మంది హాజరై నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని కేంద్రాలను ఆయన పరిశీలించి నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా జిల్లా సాయుధ దళ డీ ఎస్పీ నరేందర్‌రావు జిల్లా కేంద్రం గద్వాలలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, జ్ఞానప్రభ జూనియర్ కళాశాల, కొట్టం మాణిక్యమ్మ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోలీ సు బందోబస్తును పర్యవేక్షించారు.

● వనపర్తి జిల్లాలో శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మొత్తం 4917 మందికి గాను 4804 మంది విద్యార్థులు హాజరై, 113 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 3934మందికి గాను 3863 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్‌లో 983 మందికి గాను 941 మంది విద్యార్థులు హాజరయ్యారు.

141 మంది గైర్హాజరు

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం, జీవశాస్త్రం, హిస్టరీ పేపర్2 పరీక్షలను శనివారం నిర్వహించారు. వీటికి జిల్లా వ్యాప్తంగా 5063 మందికి గాను 4922 మంది విద్యార్థులు హాజరు కాగా 141 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 3756 మంది ఉండగా, 3638 మంది హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్‌లో 1307 మందికి గాను 1284 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 141 మంది గైర్హాజరయ్యారు.

ఉండవల్లిలో అఘోరీ హల్‌చల్

- అలంపూరు వెళ్తానని భీష్మించిన అఘోరీ

- జోగుళాంబ ఆలయ పరిసరాలలో ఉన్న దర్గాను తొలగించాలని డిమాండ్

- వివాదాస్పద ప్రకటనతో అడ్డుకున్న పోలీసులు

- దైవదర్శనం కోసం వెళితే అడ్డుకుంటారా అని వాగ్వాదం



అఘోరీతో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

అలంపూరు చౌరస్తా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అలంపూరు కు వెళుతున్న లేడీ నాగసాధువును శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని భైరాపురం స్టేజీ వద్ద డీఎస్పీ మొగులయ్య, సీఐ రవిబాబులు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల వేములవాడ దర్శనానికి వెళుతున్న అఘోరిని పోలీసులు అడ్డుకున్న సందర్భంలో అలంపూరు ఆలయ పరిసరాలలో అక్రమంగా అన్యమతానికి చెందిన దర్గాను నిర్మించారని, ఈ శుక్రవారం దర్గాను తొలగించడమే లక్ష్యంగా అక్కడకు వెళ్తానని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యాయి. అన్నట్లుగా ఆమే శుక్రవారం రాకపోయినా శనివారం అలంపూరు దైవదర్శనం పేరుతో హైదరాబాదు వైపు నుంచి అలంపూరుకు బయలుదేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఉండవల్లి, అలంపూరు మండలాల మీదుగా ఆలయానికి వెళ్లే మార్గాలతో పాటు, ఎర్రవల్లి, కోదండాపురం, మానవపాడు, అలంపూరు చౌరస్తా ప్రాంతాలలో నిఘా ఉంచి, డీఎస్పీ మొగులయ్య, సీఐ రవిబాబు, ఎస్సైలు మహేష్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు మరో 40 మంది పోలీసులతో ఉండవల్లి మండలం, భైరాపురం స్టేజీ వద్ద కాపుకాశారు. అనుకున్నట్లుగానే లేడి నాగసాధువు ఓ నల్లని కుక్కపిల్లతో కలిసి కారులో రావడంతో పోలీసులు ఆమెను అడ్డగించారు. మీరు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అక్కడికి వెళ్తే సమస్యలకు దారితీస్తుందని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దైవదర్శనం కూడా చేసుకోనివ్వరా, తన మొక్కుకు భంగం కలిగిస్తారా అని పోలీసులను అఘోరీ ప్రశ్నించింది. దర్శనం నిమిత్తం అయితే తామే తీసుకెళ్లి దర్శనం చేయిస్తామని, లేదా కొన్నిరోజుల తర్వాత వచ్చినా తామే దగ్గరుండి దర్శనం చేయిస్తామని చెప్పినా వినలేదు. కారు దిగాలనిసూచించినా ససేమిరా అనడంతో తనిఖీ చేయాలని పోలీసులు కోరగా ఆమెనే దిగి కారులో ఉన్న దైవ విగ్రహాలు తీసి కారుపై పెట్టింది. అనంతరం విగ్రహాలను కారులో ఉంచేందుకు ప్రయత్నించిన ఓ కానిస్టేబుల్‌పై షూస్ వేసుకొని విగ్రహాలను ఎలా ముట్టుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో మహిళా కానిస్టేబుల్స్ విగ్రహాలను కారు లోపల ఉంచి ఆమెను కూడా లోపల కూర్చోబెట్టి వెనక్కి వెళ్లిపోవాలని చెప్పారు. వినకపోవడంతో కర్నూలు నగరం నుంచి తెప్పించిన టోయింగ్ వాహనానికి అఘోరి ఉండగానే కారును తగిలించి హైదరాబాదు వైపు లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఆమె కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అఘోరీ వచ్చిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటువైపు వెళ్లే వాహనదారులు ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

యునెస్కో గుర్తింపు కోసం తొలి అడుగు

(3వ పేజీ తరువాయి)

యునెస్కో గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా తాత్కాలిక జాబితాలో చోటు దక్కగా కచ్చితంగా ప్రభుత్వం భారత్ తరఫున ఈ నిలువురాళ్లను ఎంపిక చేయాలనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాలు దేశంలో 56 ఉండగా కొన్నేళ్ల క్రితం రామప్పకు యునెస్కో గుర్తింపు లభించింది. ఆ తర్వాత అక్కడ అభివృద్ధి వేగం పుంజుకోవడంతో పాటు దేశ, విదేశీ పర్యాటకుల రాక ఎక్కువగా జరుగుతోంది. నిలువురాళ్లకు కూడా గుర్తింపు వస్తే చాలా వెనుకబాటులో ఉన్న నారాయణపేట జిల్లా అభివృద్ధి చెందడంతో పాటు.. పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంటుంది. వీటిని చూడటానికి వచ్చిన పర్యాటకులకు మరిన్ని పర్యాటక ప్రదేశాలను తీర్చిదిద్ది అందుబాటులోకి తెస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా టూరిజం మెరుగుపడే అవకాశం ఉంది.

- 1980లో వెలుగులోకి...

కృష్ణా మండలం ముడుమాల్‌లోని ఈ నిలువురాళ్లను మొదట 1980 సంవత్సరంలో ఇంగ్లాండ్‌కు చెందిన పురాతత్వ శాస్త్రవేత్త అల్చిన్ తన పరిశోధనతో వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ నిలువు రాళ్లు క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల నాటివి అని వెల్లడించారు. ఈ నిర్మాణాలు ఇంగ్లాండ్‌లోని విల్‌షైర్ ప్రాంతంలోని స్టోన్‌హెంజ్ తరహా నిర్మాణంలో ఉన్నాయని పరిశోధకులు పేర్కొనడంతో స్టోన్‌హెంజ్‌కు చెందిన పురాతత్వ శాస్త్రవేత్తల బృందం ఈ ప్రాంతాన్ని సందర్శించి వీడియోలు తీసుకెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన సెంటర్ ఫర్ సైబర్ ఆర్కియాలజీ, క్వాల్కం ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ థామస్ ఈలేవీ ముడుమాల్ నిలువు రాళ్ల శిలలపై త్రీడీ డాక్యుమెంటరీ రూపొందించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పుల్లారావు ఈ నిలువు రాళ్లపై అధ్యయనం చేసి, ఈ ప్రాంతాన్ని పురావస్తు ప్రాంతంగా గుర్తించి పరిరక్షంచాలని ప్రభుత్వానికి గతంలోనే నివేదించారు. ఆసియా ఖండంలో ఉన్న ఏకైక నిలువురాళ్ల ప్రాంతంపై ఆయన పలు అస్త్రానమీ సదస్సుల్లో వివరించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలనే సంకల్పంతో తెలంగాణ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాలా కూడా ప్రచారం కల్పించారు.



సప్తనక్షత్రం నిలువు రాళ్లను పరిశీలిస్తున్న మక్తల్ ఆర్డీవో రాంచందర్‌నాయక్

- ఇదే ప్రత్యేకత...

ఈ నిలువురాళ్ల చారిత్రక నేపథ్యం ఉండటమే కాకుండా సూర్యుడి గమనానికి అనుగుణంగా సమయం, వాతావరణ పరిస్థితులను తెలుసుకోవడానికి ఉపయోగించేవారు. ఆకాశంలోని నక్షత్ర సమూహాల్లో సప్తర్షి మండలంగా భావించే ఆకృతి కూడా ఇక్కడి నిలువురాళ్లపై గుర్తించారు. నీడలు ఓ క్రమంలో ఓ నిర్దిష్ట ప్రాంతంలో పడటం మొదలవగానే రుతువులు మొదలవుతాయని గుర్తించేవారని అధ్యయనంలో పురాతత్వ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ నిలువురాళ్ల నీడలు మరో క్రమంలోకి మారుతూ వెళితే వానాకాలంగా గుర్తించి, ఆ నీడల ఆధారంగా పంటల సాగు, పరిస్థితిని అంచనా వేసేవారు. ఈ నిలువు రాళ్ల ప్రాంతాన్ని అప్పటి ఖగోళ శాస్త్ర పరిశోధన కేంద్రమని కూడా భావించేవారు ఉన్నారు. వీటితో పాటు చాలా రహస్యాలు ఈ నిలువు రాళ్లలో దాగి ఉన్నట్లు చెబుతారు. ఇక్కడి రాళ్లన్నీ నల్లరాళ్లే కావడం, అవన్నీ కృష్ణానదిలో సుదీర్ఘకాలం నానిన రాళ్లగా గుర్తించారు. వీటినే ఇక్కడ నాటడంలోనే రహస్యం ఏదో దాగుందని దాన్ని తేల్చాల్సి ఉందని కూడా కొందరు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ నిలువురాళ్ల కింద ఆదిమానవుల సమాధులున్నట్లుగా కూడా భావిస్తున్నా పరిశోధనా పరంగా నిరూపించాల్సి ఉంది. ఇక్కడున్న ఒక స్కైమ్యాప్ ప్రస్తుతం వినియోగిస్తున్న స్కైమ్యాప్‌ను పోలి ఉండటం అప్పటివారి నైపుణ్యతను కూడా తెలియజేస్తుంది. ఇక్కడ దాదాపు 12 నుంచి 14 అడుగుల ఎత్తులో గండ శిలలు ఉండగా క్రమ పద్ధతిలో పాతారు. దాదాపు 80 ఎకరా విస్తీర్ణంలో ఇవి ఉండగా వాటి తరహాలోనే మరో మూడువేల వరకు చిన్నరాళ్లు ఉండేవని చెబుతారు. కాలక్రమంలో అన్నీ తుడిచిపెట్టుకుపోగా 8 ఎకరాల విస్తీర్ణం మాత్రం రైతు నుంచి భూమిని కొనుగోలు చేసి నిలువురాళ్ల సంరక్షణ బాధ్యతను డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుకు ప్రభుత్వం అప్పగించింది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కూడా కావడంతో యునెస్కో గుర్తింపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిలువు రాళ్ల పరిసరాలను పరిశీలించిన సీఐ

కృష్ణ, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముడుమాల్ గ్రామ శివారులోని కృష్ణానది ఒడ్డున ఆదిమానవుల నిలువు రాళ్లను ఆర్డీవో రాంచందర్‌నాయక్, తహసీల్దార్ బి.వెంకటేశ్, మక్తల్ సీఐ రామ్‌లాల్ శనివారం పరిశీలించారు. ఆదివారం ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థలాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తవ్వినకొద్దీ అక్రమాలు

● జూలపల్లి అటవీ సెక్షన్ అధికారి బాగోతం బట్టబయలు

మహమ్మదాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జూపల్లి అటవీ సెక్షన్ అధికారి మహమ్మదాబాద్, గండీడ్ పరిధిలోని జూలపల్లి, కొండపూర్ అటవిలో చెట్లను నరికి లక్షలాది రూపాయలను వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. రైతులు తమ పొలాల్లో ఉన్న చెట్లను నరికి, అమ్ముకుంటారు. ఆ కలను తరలించే లారీలు మహమ్మదాబాద్, గండీడ్, పక్క మండలమైన హన్వాడ మీదుగా ఈ సెక్షన్ అధికారి విధులు నిర్వహించే ప్రాంతం నుంచే వెళ్లేవి. ఈ సందర్భంగా అతను ఒక్కో లారీ నుంచి రూ.3 వేలు వసూలు చేసినట్లు సమాచారం. దాంతో ఆ లారీల్లోనే ఏడాది కాలంగా అడవిలోని విలువైన నీలగిరి, ఇతర చెట్లను నరికి వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారులను బెదిరించి, తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. చెట్ల మొదళ్లను లారీల్లో తరలించగా, మిగిలిన కొమ్మలను వంట చెరుకు కోసం ట్రాక్టర్ల ద్వారా తరలించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2 వేల వరకు వసూలు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. నరికిన చోట ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా ఎక్స్‌కవేటర్ల ద్వారా చెట్ల మొదళ్లను తవ్వించి, పెట్రోల్ పోసి కాల్చి, నిప్పంటించాడు. తర్వాత మళ్లీ అక్కడ మట్టి నింపాడు. ఆ చెట్ల స్థానంలో మొక్కలు నాటించి, పై అధికారులకు అనుమానం రాకుండా చేశాడు. ఈ తతంగం ఏడాదిన్నర నుంచి జరుగుతున్నా అధికారులకు చిన్న అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు. ఇక్కడి నుంచి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు విలువ చేసే కలపను అమ్మినట్లు తెలుస్తోంది.

అధికారులకు తప్పుడు సమాచారం

నీలగిరి కలపతో వెళ్తున్న లారీ ఆమనగల్ రేంజ్ పరిధిలో పట్టుపడటంతో అక్కడి అధికారులు మహబూబ్‌నగర్ డీఎఫ్‌వో, రేంజ్ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు విచారణ చేపట్టారు. ఇంత జరిగినా అటవీ నుంచి కలప రవాణా జరుగలేదని సదరు అధికారి చెప్పినట్లు తెలుస్తోంది. కూలీలు, అటవీ ప్రాంత పక్క పొలాల రైతులతో తప్పుడు సమాచారం ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అక్కడి విచారణకు వచ్చి అధికారులు మాత్రం ఇంత పెద్దమొత్తంలలో చెట్ల నరికి అమ్ముకొవడం , పెద్ద మొత్తంలో అక్రమాలు పాల్పడినట్లు విచారణలో తెలినట్లు తెలుస్తుంది .ఇందుకు సంబంధించిన విచారణ పుర్తిచేసిన మరో మారు విజిలేన్స్ అధికారులుతో విచారణ చేయించే అవకాశం ఉందని తెలుస్తుంది, నేడో రేపో విజిలెన్స్ అధికారులు అటవీ ప్రాంతంలో పర్యటించనున్నట్లు సమాచాం .



కొండాపూర్ నర్సరీలో ఎండిన మొక్కలు

నర్సరీని పట్టించుకోలేదు..

చెట్లను నరికి, సొమ్ము చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసిన నర్సరీపై పెట్టలేదు. జూపలల్లి బీట్ పరిధిలోని ఆర్ఎఫ్ కొండాపూర్ బ్లాక్ నర్సరీలో పలు రకాల మొక్కలు పెంచుతున్నారు. అవి ఎండుతున్నా పట్టించుకోలేదు. అక్కడ పని చేసే తమకు కూలి సరిగా ఇవ్వలేదని కూలీలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు అక్కడికి పరిశీలన కోసం రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది.

విచారణ పూర్తి చేశాం

జూలపల్లి అటవీలో కలప రవాణాకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేశాం. విచారణ నివేదికను సోమవారం జిల్లా అధికారులకు అందిస్తాం. పట్టుపడ్డ కలప లారీని పరిశీలించాం. అడవిని కూడా పరిశీలించాం. మేము అనుకున్న దానికంటే ఇక్కడ చాలా అక్రమాలు జరిగినట్లు దృష్టికొచ్చింది. కూలీ డబ్బులు సరిగా ఇవ్వడం లేదని కొందరు కూలీలు చెప్పారు.

- అబ్దుల్ హై, ఫారెస్ట్ రేంజ్ అధికారి

ధర్మాస్పత్రి.. దయనీయం

» ఉమ్మడి జిల్లాలోని జనరల్ ఆసుప్రతుల్లో రోగుల అవస్థలు
» 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో తారసపడిన అనేక సమస్యలు

ధర్మాసుపత్రి పరిస్థితి దయనీయంగా మారింది. రోగులకు కనీస వసతులు లేక దుర్గతిలో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనరల్ ఆసుపత్రులను శనివారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా.. సమస్యలు అనేకం తారసపడ్డాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జనరల్ ఆసుపత్రుల్లో ఎటు చూసినా అపరిశుభ్రత కనిపించింది. రోగులను టచ్ చేస్తే వారు అనేక సమస్యలు ఆవేదనతో వెలిబుచ్చారు. తాగేందుకు నీరు లేక.. కూర్చుందామంటే కుర్చీలు లేక నానా అవస్థలు పడుతున్నట్లు వెల్లడించారు. సిబ్బంది కొరతతో కూడా రోగులకు వైద్యం అందని ద్రాక్షగానే మారింది. రోగులను ఆసుపత్రి లోపలకు తరలించేందుకు కూడా సిబ్బంది సుముఖత చూపకపోవడం గమనార్హం. రోగులను వారి బంధువులే స్ట్రెచర్లలో తీసుకెళ్లడం కనిపించింది.



ఆంధ్రజ్యోతి విజిట్


నారాయణపేట ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వంట గది

పారిశుధ్యం... అధ్వానం....

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పేరుకే పెద్దాసుపత్రి.. కానీ కనీస సౌకర్యాలు లేని దౌర్భాగ్యాసు పత్రి. ఇటీవల 900 పడకల స్థాయి పెరిగినా పరిస్థితి మాత్రం అధ్వానంగానే ఉంది. తాగడానికి నీళ్ల లేవు.. మరుగుదొడ్లు అ ధ్వానంగా ఉన్నాయి. స్నానపు గదులు లేవు. వార్డుల్లో సగం వ రకు ఫ్యాన్లు పనిచేయడం లేదు. శానిటేషన్, పేషెంట్ కేర్ అటెండర్లు ఎక్కడుం టారో తెలియదు. రోగి వెంట వచ్చిన బంధువులే వీల్ చైర్లను తోపుకుంటూ వెళు తున్నారు. ఇక స్కానింగ్‌కు ఉదయం 6 గంటల నుంచే క్యూలో నిలబడాల్సి వస్తుంది. శనివారం జనర ల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగు చూసిన అంశాలివి.

» తాగడానికి రూపాయి నీళ్లే దిక్కు....

ఇంతపెద్ద ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులకు తాగడానికి నీళ్ల లేవు. దీంతో ఆసుపత్రి ఆవరణలో ఓ స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన ఒక్క రూపాయి బిళ్ల నీళ్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో ప్రతి వార్డు బయట తాగునీటి డబ్బాను ఏర్పాటు చేసేవారు. కానీ గత రెండేళ్లుగా దాన్ని తీసేశారు. అవసరాల కోసం నీళ్ల ఉన్నప్పటికీ తాగడానికి మాత్రం రూపాయి నీళ్లే దిక్కు.

» కంపుకొడుతున్న మరుగుదొడ్లు....

జనరల్ ఆసుపత్రి భవనంతో పాటు మాతాశిశు సంరక్షణ భవనంలో ఉన్న మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. లోపలికి వెళితే పూర్తిగా కంపుకొడుతున్నాయి. రోజుకు ఒక్కసారి కూడా శుభ్రం చేయలేని దుస్థితిలో ఉన్నాయి. మూత్రశాలలు సైతం అదే స్థితిలో ఉన్నాయి. జనరల్ మెడిసిన్ ఓపి ప్రాంతంలో ఉన్న మరుగుదొడ్లు కూడా కంపుకొడుతున్నాయి.


రోగిని వీల్‌చైర్‌పై తీసుకెళుతున్న బంధువులు

» ప్రత్యేకంగా స్నానపు గదులు లేవు...

రోగి బంధువులకు స్నానాలు చేసుకునేందుకు ప్రత్యేకంగా స్నానపు గదులు లేవు. మరుగు దొడ్లు, మూత్రశాలలలోనే స్నానాలు చేసుకుంటున్నారు. కొంతమంది మాత్రం బయట ఉన్న సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరికొంతమంది ఆరుబయటే స్నానాలు చేసుకోవడం, బట్టలు ఉతుక్కోవడం చేస్తున్నారు.

» పనిచేయని ఫ్యాన్లు...

ఆసుపత్రి మొత్తంలో చాలా వరకు ఫ్యాన్లు పనిచేయడం లేదు. కొన్ని ఫ్యాన్లు చాలా నెమ్మదిగా తిరుగుతున్నాయి. దీంతో ఉక్కపోతతో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో బాలింతలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి చూడలేక కొంతమంది రోగి బంధువులు తమ ఇళ్ల నుంచి ఫ్యాన్లు తెచ్చుకొని పెట్టుకుంటున్నారు.

» స్కానింగ్ కోసం 6 గంటల నుంచి క్యూ...

కడుపుకు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ కోసం చేసే అల్ట్రా సౌండ్ స్కానింగ్ కోసం ఉదయం 6 గంటల నుంచి జనం క్యూలో నిలబడతారు. రోజుకు 40 మందికి మాత్రమే ఈ టోకెన్లు ఇస్తున్నారు. దీంతో మిగతా వారు వెనుతిరిగి వెళ్లి పోతున్నారు.

» క్యాంటీన్ సౌకర్యం లేదు...

ఆసుపత్రి మొత్తంలో ఒక్క క్యాంటిన్ కూడా లేదు. ఆసుపత్రి ముందు ఓ మహిళా సంఘం క్యాంటిన్ మాత్రమే ఉంది. అంతదూరం వెళ్లి టిఫిన్, భోజనాలు తెచ్చు కుంటున్నారు. అయితే గతంలో ఆసుపత్రికి అద్దె చెల్లిస్తున్నా క్యాంటిన్ ఉండేది. దాన్ని తొలగిం చడంతో ప్రస్తుతం బయటి క్యాంటిన్‌లపై ఆధా రపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

రోగి బంధువులే అటెండర్లు...

ఆసుపత్రిలో పేషెంట్ కేర్ అటెండర్లు దాదాపు 50 మంది వరకు ఉంటారు. కానీ క్యాజువాలిటీ, ఆయా వార్డుల వద్ద ఒక్కరు కూడా కనిపించడం లేదు. రోగుల బంధువులే అటెండర్లుగా మారి వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళుతున్నారు. కనీసం వీల్ చైర్లుగానీ, స్ట్రెచర్లు గానీ దొరకని పరిస్థితి ఉంది.

నిత్యం రోగులతో కిటకిట సౌకర్యాలు లేక సతమతం

నారాయణపేటటౌన్ (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి నిత్యం వందల్లో రోగులకు చికిత్స అందించి ప్రాణాలు కాపాడాల్సిన జీజీహెచ్ సమస్యలతో సతమతమవుతున్నది.


దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి చికిత్స కోసం వస్తుంటారు. ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు, ప్రసవం కోసం వచ్చే గర్భిణులతో నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇలాంటి ప్రధాన ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఆసుపత్రిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమం గా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు సైతం లేవు. భోజనాల నిర్వహణ కూడా సక్రమంగా లేదని, నాసిరకం భోజనంతో పాటు చాలీచాలని భోజనం అందిస్తున్నారంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ 120 మంది రోగులకు భోజనం అందిస్తున్నారు. అయితే రోగుల వెంబడి వచ్చిన సహాయకులకు భోజనం ఇవ్వడం లేదు. అదే విధంగా 30 మంది డాక్టర్లు సైతం అక్కడే భోజనం చేస్తారు.

వీరంతా వరండాలో, నేల మీద కూర్చుంటున్నారు. ఇదిలా ఉండగా చిన్న పిల్లల ఆసుపత్రిలో అనేక సమస్యలు ఎదుర్కొం టున్నా రు. వేసవి కాలం కావడంతో రోగు లకు సహాయంగా వచ్చిన వారికి కూర్చో డానికి స్థలం కొరత ఉంది.


రోగులకు సహాయంగా వచ్చిన వారికి ఏర్పాటు చేసిన వేయిటింగ్ హాల్, నేలపై పడుకున్న రోగుల బంధువులు


చిన్న పిల్లల ఆసుపత్రిలో వరండాలో కూర్చున్న రోగుల బంధువులు

సమస్యలకు నిలయం..


ఆసుపత్రిలో వెయిటింగ్ హాలు లేక చెట్ల కిందనే ఉన్న రోగుల బంధువులు

గద్వాల క్రైం, (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా జనరల్ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారింది. దీంతో రోగాల నివారణకు వచ్చే రోగులు, వారి వెంట వచ్చే బంధువులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇటీవలే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అయినా కూడా సమస్యలను పరిష్కరించడంతో అధికారులు విఫలం అవుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం దా దాపు 800 మంది రోగాల నివారణకు వస్తున్న వారికి తగిన వసతులు లేకపోవడంతో రోగులు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

» మంచినీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు...

జిల్లా జనరల్ ఆసుపత్రిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు రోగులు వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా సరిపడక రోగులు బయట నుంచి వాటర్ బాటిల్స్ ద్వారా కొనుగోలు చేసుకుంటున్నారు. అంతేకాకుండా టాయిలెట్స్‌లో నీటి సమస్య ఎక్కువగా ఉన్నది.

» రోగికి సహాయంగా వచ్చిన వారు చెట్ల కింద తినాల్సిందే...

డైనింగ్ హాలు లేక రోగుల వెంట వచ్చే బంధువులు చెట్ల కింద, మెట్ల మీద భోజనం చేయాల్సిందే. గత ఆరేళ్ల కిందట రూ. 90 లక్షలు డైనింగ్ హాలు నిర్మాణానికి మంజూరైనా దానిని నిర్మించడంలో విఫలమయ్యారు. ఆ నిధులు వెనక్కి మళ్లినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

» డాక్టర్లకు ఓపీ రూంల కొరత..

డాక్టర్లు పరిశీలించడానికి ఓపీ రూముల కొరత ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. ఆసుపత్రిలో దాదాపు 36 మంది డాక్టర్లు ఉండగా కేవలం పది సంఖ్యలో కూడా ఓపీ రూంలు లేకపోవడంతో డాక్టర్లు రోగులను పరిశీలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

» బెడ్‌షీట్ల కొరత...

జనరల్ ఆసుపత్రిలో బెడ్‌షీట్ల కొరత తీవ్రంగా ఉందని రోగులు తెలిపారు. అంతేకాకుండా రోగాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో బెడ్స్ కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కానీ స్థలాభావం వల్ల కొన్ని బెడ్స్‌ను అలాగే భద్రపరిచినట్లు తెలుస్తుంది. వీటికి తోడు ప్రభుత్వ ఆసుపత్రిలోని సీజరిన్ వార్డులో ఫ్యాన్‌ల కొరత తీవ్రంగా ఉంది. మహిళల బాత్‌రూమ్‌లో ఉదయం పూర్తిస్థాయిలో నీటి సమస్య ఉన్నట్లు గట్టు మండల పరిధిలోని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణుల వార్డులో కూడా కొన్ని ఫ్యాన్‌లు పని చేయటంలేదు.

» చెట్ల కిందే భోజనాలు..


ఆరుబయటే భోజనం

జిల్లా జనరల్ ఆసుపత్రిలో వేయిటింగ్ హాల్స్ లేకపోవడంతో చెట్ల కిందనే రోగుల బంధువులు ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. అక్కడే తెచ్చుకున్న భోజనాలు చేయడం కనిపించింది. రోగులకు స్నానపు గదుల కొరత ఉంది. అంతేగాక మరుగుదొడ్ల కొరత,

వసతులు లేక ఇబ్బందులు


నాగర్‌కర్నూల్ ఆసుపత్రిలో క్యూలైన్‌లో రోగులు

కందనూలు, (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిలో వసతులు లేక.. ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులు శనివారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో కనిపించాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు సరైన బాతురూమ్‌లు, స్నానపు గదులు లేక అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు భోజనాలు చేయడానికి కిచెన్ లేక తినడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ సదుపాయాలు లేక ఆసుపత్రికి వచ్చే వారు తీవ్ర సతమతమవుతున్నారు. బాత్‌రూ మ్‌లో సక్రమంగా నీరు అందటం లేదు. సరైన మరుగుదొడ్లు లేక డబ్బులు చెల్లించి ప్రైవేట్ వారి సులభ్ కాంప్లెక్స్‌లోకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రోగులకు దుప్పట్లు, బెడ్లు సక్రమంగా ఉన్నప్పటికీ వారి వెంట ఉన్న వారు నానా రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో తాగడానికి సాయిబాబా ట్రస్టు ద్వారా ఒక రూపాయికి లీటరు నీరందే విధంగా ప్లాంట్ ఏర్పా టు చేశారు. సాయిబాబా ట్రస్టు ద్వారా రోగులు వారి వెంట వచ్చిన వారికి ప్రతి రోజు దాదాపుగా 100మందికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు.

సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు



జిల్లా ఆసుపత్రిలో రోగుల వెంట వచ్చిన వారికి సదు పాయాలు లేకపోవడంతో తీవ్ర ఇ బ్బందులను ఎదుర్కొంటున్నాం. బా తురూమ్‌లు లేవు. వాటిలో నీరు లేవు. తినడానికి కిచెన్ లేదు. ఆరు బయట కూర్చొని తినాల్సిన దుస్థితి ఏర్పడింది.

- కృష్ణయ్య, అచ్చంపేట

ఎక్కడ చూసినా అపరిశుభ్రం



ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం లోపించింది. ఎక్కడ కూర్చోవాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బాతురూమ్ లేక బయటకు వెళ్లాల్సి వస్తోంది.

- జి.తిరుపతమ్మ, పెద్దముద్దునూర్



ఆసుపత్రి ప్రాంగణంలో ఆరుబటయ తింటున్న రోగుల వెంట వచ్చిన వారు


నాగర్‌కర్నూల్ ఆసుపత్రిలో అపరిశుభ్రంగా నీటి ట్యాంకు పరిసరాలు

సౌకర్యాలు అరకొరే...

వనపర్తి వైద్యవిభాగం, (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభు త్వ ఆసుపత్రిని గత ప్రభుత్వ హయాంలోనే జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అంతే కాకుండా పట్టణానికి సమీపంలో ఉన్న నర్సింగాయపల్లి దగ్గర మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి గర్భిణులకు, చిన్నారులకు, మహి ళలకు వైద్య సేవలు అంది స్తున్నారు. ఇక్కడ రోజుకు, రోగుల సహాయకుల కోసం ప్రత్యేక వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బంది లేకుండా చేశారు.

నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రి కావడంతో కిచెన్ రూం, వాడుకునే నీరు, బాత్‌రూం లు, మరుగుదొడ్లు ఉన్నాయి. తాజాగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆస్పత్రి ఆవర ణంలో రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ హాల్ నిర్మాణం కూడా చేపట్టారు. ఇక్కడ క్యాం టీన్ లేకపోవడం వల్ల ఇటీవలే మహిళా శక్తి ఆధ్వర్యంలో రెండు క్యాంటీన్‌ల ఏర్పాటు కోసం మహిళా సంఘాలకు అనుమతులు ఇచ్చారు. ఇదంతా బాగానే ఉన్నా సౌకర్యాలు మాత్రం అరకొరగానే ఉండటం గమనార్హం.


కాలు విరిగిన మహిళను వార్డుకు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

» స్ట్రెచర్, వీల్‌చైర్ల కొరత...

జనరల్ ఆస్పత్రి కావడంతో రోగుల తాకిడి అధికంగానే ఉంటుంది. వారికి సరిపడ స్ట్రెచర్‌లు, వీల్ చైర్‌లు లేవు. ఇలాంటి సమస్యలే కాకుండా రోగులను వార్డుకు మార్చే క్రమంలో పేషెంట్ కేర్ సిబ్బందికి బదులు రోగుల సహాయకులే స్ట్రెచర్‌లు, వీల్ చైర్‌లను తోసుకుంటూ వార్డులకు వెళుతున్న సంఘటనలు కూడా నిత్యం చోటుచేసుకుంటున్నాయి.


డాక్టర్ రౌండ్స్‌కు రావడంతో కూర్చోవడానికి కుర్చీలు లేక వార్డు ముందు నిరీక్షిస్తున్న రోగుల సహాయకులు

» ఆరుబయటే భోజనాలు...

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని 2002 సంవత్సరం సెప్టెంబరులో 100 పడకల ఆస్పత్రిగా నిర్మాణం చేపట్టారు. 23 సంవత్సరాల పాత ఆస్పత్రి భవనం కావడంతో ఇక్కడ అన్ని ఇబ్బందులే దర్శనమిస్తున్నాయి. గతంలో మూడు ఇంచుల పైల్లైన్ ద్వారా బాత్‌రూంలు, మరుగుదొడ్లు నిర్మించారు. రోజు ఇద్దరు స్వీపర్లు జామ్ అయిన మరుగుదొడ్లు, బాత్‌రూంలను శుభ్రం చేయడమే పనిగా మారింది. రోగుల సహాయకులకు సైతం వెయిటింగ్ హాల్ లేకపోవడంతో చెట్లకిందే సేద తీరుతుంటారు. ప్రత్యేక గది కానీ, రేకుల షెడ్డు వంటి సౌకర్యాలు లేక ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణలో 12 మందిపై కేసు

- వివరాలు వెల్లడించిన ఎస్ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా మద్యం మత్తులో దాడి చేసిన ఘటనలో శనివారం 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అయిన లక్ష్మన్, నాగరాజు, రమేష్‌తో పాటు వడ్లవీధికి చెందిన మరికొందరు హోలీ ఆడి కృష్ణానదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో తెలుగుపేటకు చెందిన ఓ నాయకుడి అనుచరులు రావడంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. పట్టణానికి బీజేపీ నాయకుడు రజక నర్సింహులు వర్గీయులపై, కాంగ్రెస్ నాయకుడు డీటీడీసీ నర్సింహులు వర్గీయులు దాడి చేశారని ఇరువురు శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. ఇంతరలో రజక నర్సింహులు ఫిర్యాదు రాస్తుండగా అప్పడే డీటీడీసీ నర్సింహులుతోపాటు మరికొందరు దుర్భాషలాడి స్టేషన్‌లోనే ఘర్షణ పడ్డారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు వారి అనుచరులపై లాఠీ చార్జ్ చేశారు. ఈ ఘటనపై శనివారం పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేపట్టారు. ఇప్పటివరకు ప్రధాన నాయకులతో పాటు మరో 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

మిడ్జిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నీటిగుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం కామదహనం అనంతరం రాత్రి బూడిదను తీసుకొని వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఆవులపై చల్లేందుకని వెళ్లాడు.

ప్రమాదవ శాత్తు నీటి గుంతలో పడిపోయాడు. చంద్రయ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం గ్రామ ఆలయం వెనుక ఉన్న నీటి గుంతలో శవమై కనిపించినట్లు తెలిపారు. మృతుడి కొడుకు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మృతుడికి భార్య కళమ్మ, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది.

మూడు బస్సులు ఢీ తప్పిన ప్రమాదం


ఒక దాని వెంబడి ఒకటి ఢీకొన్న బస్సులు

భూత్పూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులంతా ఘాడ నిద్రలో ఉన్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా శబ్దం రావడంతో నిద్ర లోంచి ఉలికి పడి లేచారు. ముందుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో మూడు ప్రైవేటు (స్లీపర్ కోచ్) బస్సులు ఢీకొనగా.. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. శనివారం తెల్లవారుజామున భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారిపైన ఈ సంఘటన చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు శుక్రవారం అర్ధరాత్రి మూడు ప్రైవేటు ట్రావెల్ బస్సులు (శ్రీరామ, సీఎంఆర్, టీవీకే) బయలుదేరాయి. భూత్పూర్ సమీపంలోకి రాగానే ఉడిపి శ్రీకృష్ణ హోటల్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ బ్రేకు వేయడంతో వెనువెనకాలే వస్తున్న మూడు ట్రావెల్ బస్సులు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ మూడు బస్సుల్లో దాదాపుగా 120 మంది ప్రయాణికులు ఉన్నారు. భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆయా బస్సు డ్రైవర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీంనగర్, రెవెన్యూ కాలనీ, కృష్ణవేణిచౌక్, రాజీవ్‌మార్గ్, నల్లకుంట, లింగంబాగ్ కాలనీ, శ్రీనివాసకాలనీ, గంజిరోడ్డు, చింతలపేట, పెద్దఅగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

గట్టు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మల చెరువు గ్రామంలో శనివారం కంటి వైద పరీక్షలు నిర్వహించారు. భవిష్యభారత్ ఎల్‌టీఐ మ్యాన్‌డేట్రీ ఫౌండేషన్ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షల ద్వారా కంటి లోపాలను, కంటికి సోకిన వ్యాధులను గుర్తించవచ్చునని వైద్యులు అశ్రఫ్ ప్రజలకు వివరించారు. ముందస్తు చికిత్స ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చని తెలిపారు. 200 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో రాగిణి, జిలాని, నాగరాజు, ఆశాకార్యకర్త విజయలక్ష్మి, శ్రీదేవి, హలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి

గద్వాల న్యూటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లను రెగ్యులరైజ్ చేయాలని యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎమేలమ్మ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమాధికారి సునందకు కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్న సేవలను గుర్తించి సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టులు సైతం పర్మినెంట్ చేయాలని సూచనలు చేశారన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నూతన విద్యావిధాన చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోంరు. ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మమ్మ, రూపశ్రీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ ఉన్నారు.

ఆర్డీఎస్ కెనాల్‌కు నీరు వదలాలి

వడ్డేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ కెనాల్‌కు సాగునీరు వదలి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. రబీలో సాగవుతున్న పంటలకు ఈ విడతలో నీరు వదిలితే చేతికి వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒక తడి నీరు కట్టుకుంటే దిగుబడి వస్తాయని రైతులు చెబుతున్నారు. దాదాపు 90 శాతం మేర పంటల సాగు పూర్తయ్యి చేతికొచ్చే దశలో ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని చివరి తడికి సాగునీరు వదిలి పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు.

'కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

గద్వాల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కల్యాణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీఎం ఇచ్చిన హామీలు, ప్రకటించిన గ్యారెంటీలు అమలు చేయాలే కానీ అడ్డగోలు మాటలు చెప్పడం సరికాదన్నారు. నరేందర్, రాజు, బలి చక్రవర్తి, మహేష్, సందేశ్ పాల్గొన్నారు.

చారిత్రాత్మక బావిని కాపాడాలి

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న పురాతన బావిని కబ్జాకు గురికాకుండా కాపాడాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కోరారు. వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, టీపీఎఫ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజుతో కలిసి శనివారం అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. సంస్థానాధీశుల కాలంలో విలువైన రాతి కట్టడంతో నిర్మించి బావిని ఇటీవల కొంత మంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారి దృష్టికి తెచ్చారు.

సీఎంఆర్ ధాన్యం విక్రయించిన వ్యక్తి అరెస్టు

గద్వాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సేకరించిన సీఎంఆర్ ధాన్యాన్ని బియ్యం రూపంలో ఇవ్వకుండా అక్రమంగా విక్రయించిన మిల్లు యజమానిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ టంగుటూరు శ్రీను తెలిపారు. మండలంలోని కాకులారంలో కృష్ణా రైస్ మిల్లు యజమాని ఈడిగ కృష్ణయ్యగౌడ్ 2021-22లో ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యం కేటాయించింది. దాదాపు రూ.3.76కోట్ల విలువైన ధాన్యం తిరిగి ఇవ్వకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో నాలుగు మిల్లుల్లో ధాన్యం మాయమైనట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఎట్టకేలకు కృష్ణయ్యగౌడ్‌ను అరెస్టు చేసి అలంపూర్ కోర్టులో హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలేవీ?

- గ్రామాల్లో గుంపులుగా సంచారం
- చిన్నారులు, మూగజీవాలపై దాడి



కేటీదొడ్డిలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు



వీధికుక్కల దాడిలో మృతి చెందిన ఆవుదూడ (ఫైల్)

కేటీదొడ్డి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధి కుక్కలను అదుపు చేయకపోవడంతో అవి ప్రజలు, మూగజీవాలపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే మండలంలోని చాలా గ్రామాల్లో కుక్క కాటుకి గురై ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇళ్ల వద్ద పెంచుకున్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లపై దాడి చేయడంతో చాలా వరకు మృత్యువాతపడ్డాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం

ఆరేళ్ల క్రితం అధికారులు వీధికుక్కలను పట్టే వారిని పిలిపించి దూరపు ప్రాంతాల్లో వదిలేశారు. ఆ సమయంలో తప్పిపోయి ఉన్న కొన్ని వాటి సంతతితో ఈ ఆరేళ్లలో మరిన్ని పెరిగిపోయాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ ఆరేళ్లలో మండలంలోని ప్రతి పెద్ద పంచాయతీలో 200 నుంచి 300 పైగానే వీధికుక్కలు ఉన్నట్లు కేటీదొడ్డి, నందిన్నె, కొండాపురం, పాతపాలెం, కుచినెర్ల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వెంటనే కుక్కలను తరలించాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మండల కేంద్రంలో మా ఇంటి వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నపిల్లలను వీధి కుక్కలు కరవడానికి వెళ్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నాపై దాడి చేశాయి. నియంత్రించాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేసిన ప్రతీసారి వీధికుక్కలను తరలించే వారిని పిలిపించి ఇతర ప్రాంతాలకు తరలిస్తామని చెబుతారే తప్పా, ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు.

\- రాజు, కేటీదొడ్డి

ప్రమాదాల బారిన పడుతున్నాం



పగలు, రాత్రి తేడా లేకుండా మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై వందల సంఖ్యలో వీధి కుక్కలు తిరుగుతుంటాయి. రోడ్డుపై వాహనదారులు వెళ్తున్న ప్రతీసారి దాడి చేయడానికి వెంబడిస్తుండడంతో అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యారు. పాఠశాలకు వెళ్లే పిల్లలపై దాడి చేయడానికి వెళ్తున్నాయి. ఒంటరిగా వెళ్తే కుక్కకాటుకు గురికావాల్సిందే. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

\- వీరేష్, కేటీదొడ్డి

విఫలంతోనే విజయతీరాలు

- కలెక్టర్ బీఎం సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఎర్రవల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో విఫలంతోనే విజయ తీరాలకు చేరుతారని అందుకు తన జీవితమే నిదర్శనమని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాల వార్షికోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్ మాట్లడారు. గద్వాల జిల్లా ప్రాంతీయ వాతావరణం కలిగి ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో మొదటగా సీబీఎస్ఈ విద్యను ప్రవేశపెట్టిన యాజమాన్యాన్ని అభినందించారు. తాను సివిల్స్ ప్రిపేర్ అయినప్పుడు ఇంటర్వ్యూ దాకా వెళ్లి విఫలమయ్యానని, మరో ప్రయత్నంలో ఐఏఎస్ అధికారిగా ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలను కలెక్టర్ అభినందించారు. అనంతరం మండలంలోని కొండేరు గ్రామ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను మండల విద్యాధికారి అమీర్‌పాషతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.

ఎరువులు, విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మి



రైతులకు అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి లక్ష్మి

గద్వాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని సంగాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ.. రైతులు తమ హక్కులను రక్షించుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో వ్యాపారి నుంచి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. మీకు నష్టం వాటిల్లినప్పుడు వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఉన్నదా? లేదా అని తెలుసుకున్నారు. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ సామగ్రి కొనుగోలులో అధిక ధరలు నియంత్రించబడుతున్నాయా అని తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లితో బీమా ద్వారా పరిహారం పొందవచ్చని, రైతులు పంటల బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇందుజ, శ్యామల, శ్రీనివాసులు, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

- వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు ప్రభుత్వం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్ అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వర్తక, వాణిజ్య వ్యవహారాలు విస్తృతంగా జరుగుతున్న ప్రస్తుత మార్కెట్‌లో వస్తు సేవలకు సంబంధించి వినియోగదారుడు పూర్తి సమాచారాన్ని తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఆసర స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భరత్, కన్వీనర్ మహేశ్, ఈశ్వర్ వినియోగదారులకు ఉండే హక్కులు, వస్తువుల కొనుగోలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వీడియో మేకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వాణిజ్య విభాగం హెచ్‌వోడీ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు పద్మ, నారాయణ, పెద్ద వెంకటేష్, ఎండీ రఫీక్, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతీ వైద్య విద్యార్థికి ఐదు కుటుంబాల దత్తత



రామ్‌నగర్ బస్తీ దవాఖాన వద్ద విద్యార్థులు

గద్వాల సర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న బస్తీ ప్రభుత్వ దవాఖానను శనివారం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాలు, రక్తపోటు, మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్థుల వివరాలతో పాటు సేవల గురించి మెడికల్ ఆఫీసర్ శరణ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, మధు మాట్లాడుతూ.. ప్రతి వైద్య విద్యార్థి ఐదేళ్ల వరకు ఐదు కుటుంబాలను వైద్య సేవలందించేందుకు దత్తత తీసుకున్నారని వివరించారు. ఆరోగ్య రీత్యా వైద్య అవసరం బట్టి ఆసుపత్రికి పంపిస్తామని చెప్పారు. ఆరోగ్య సమాచారం సేకరించి విద్యార్థులు సమర్పిస్తారని వివరించారు.

ఆశయ సాధనే కాన్షీరామ్‌కు నిజమైన నివాళి



గద్వాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారమే లక్ష్యంగా బడుగు, బలహీనవర్గాలను ఏకం చేసిన కాన్షీరామ్‌కు ఆయన ఆశయాల సాధనతోనే నిజమైన నివాళి అర్పించగలమని న్యాయవాది మధుసూదన్‌బాబు అన్నారు. కాన్షీరామ్ జయంతిని శనివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాన్షీరామ్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ప్రభాకర్, అతిక్‌ఉర్ రెహమాన్, వాల్మీకి, వినోద్ కుమార్, కోళ్ల హుసేన్, బసవరాజు, పల్లయ్య, మగ్బూల్ పాల్గొన్నారు. అదే విధంగా బహుజన సమాజ్ పార్టీ నాయకులు నాగేష్, దేవన్న, దేవేందర్, రాఘవేందర్, కృష్ణ కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

నిరుద్యోగులకు డ్రైవింగ్‌లో శిక్షణ

గద్వాల న్యూటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఎంవీ (హెవీ మోటార్ వెహికిల్), ఎల్‌ఎంవీ (లైట్ మోటార్ వెహికిల్) డ్రైవింగ్ శిక్షణ కోసం బీసీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రం, ఫొటో, సంబంధిత పత్రాలతో ఈ నెల 15లోగా జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారికి ఉపాధి నైపుణ్యాలపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు శిక్షణతో పాటు చివరి రోజు ఉద్యోగమేళా ఉంటుందని తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వచ్చే నెల 20 నుంచి సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు

గద్వాల సర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు, కో ఆర్డినేటర్ సునీతమ్మ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ వరకు కొనసాగే పరీక్షలు రెండు విడతల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. సార్వత్రిక ప్రయోగ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి మే 3వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు.

జీవితంలో అమ్మానాన్నలే మొదటి గురువులు

మానవపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి జీవితంలో అమ్మానాన్నలే మొదటి గురువులని మోటివేషనల్ స్పీకర్ వెంకటేశ్ అన్నారు. శనివారం అలంపూరుచౌరస్తాలోని మహాత్మజ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈవో శివప్రసాద్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సంస్కారం, ఆత్మవిశ్వాసం, ధైర్యం, పట్టుదల, లక్ష్యం అలవర్చుకోవాలని, అప్పుడే జీవితంలో ఏదైన సాధించుకోగలమని అన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ధరూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో శనివారం రాత్రి ఎస్ఐ కొండా శ్రీహరి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, సరైన పత్రాలు లేని వాహనాలపై 14 చలాన్లు విధించామన్నారు. ప్రతీ రోజు ప్రధాన రహదారుల వద్ద డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

పట్టుబడిన మద్యం బాటిళ్ల ధ్వంసం

ధరూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో 2023-24 ఎన్నికలకు సంబంధించి పట్టుబడిన మద్యాన్ని నిల్వ ఉంచారు. విచారణ పూర్తయిన అనంతరం శనివారం ఎక్సైజ్ సీఐ గణపతి, ధరూర్ ఎస్ఐ కొండా శ్రీహరి ఆధ్వర్యంలో 521 బాటిళ్ల మద్యాన్ని పారబోసి ధ్వంసం చేశారు. అక్రమ మద్యం పట్టివేతలో భాగంగా కేసును పూర్తి చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీలకు వసతులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు



కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

అయిజ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులకు వచ్చిన కూలీలకు వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆదేశించారు. శనివారం మండలంలోని బింగిదొడ్డి, సంకాపూర్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతీ కూలీకి రోజుకు రూ. 300 వచ్చే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. కూలీలు పనులు చేసే ప్రాంతంలో షేడ్ నెట్ ఏర్పాటు, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. పనులకు అధికంగా కూలీలు వచ్చేలా చూడాలని కార్యదర్శులకు ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీవో వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కృత్రిమ మేధ అవసరం

అయిజ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కృత్రిమ మేధ ద్వారా విద్యను అందించటం అవసరమని ఎంఈవో రాములు అన్నారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయటం కోసం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద రెండో విడతలో జిల్లాలో 24 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో అయిజ మండలంలోని ఉత్తనూర్ ప్రభుత్వ పాఠశాల ఎంపికైందని, ఇందులో కృత్రిమ మేధ ద్వారా విద్యార్థులకు బోధన అందించటం జరుగుతుందన్నారు. ఎంఈవో హాజరై తరగతులను ప్రారంభించారు. హెచ్‌ఎంలు సోమశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మల్లేష్, చంద్రకళ, పారిజాత, పర్వీన్‌బేగం, సుకుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు

- వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగాన్ని రక్షించుకోవడం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న తలపెట్టిన చలో పార్లమెంట్ ఆందోళనను విజయవంతం చేయాలని పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆందోళన కరపత్రాలను శనివారం పట్టణంలోని మినీ వాహనాలు, ఆటో కార్మికులతో కలిసి విడుదల చేశారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు ఎలాంటి సామాజిక భద్రత లేకపోగా, దాడులు పెరగడం శోచనీయమన్నారు. నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు పెరిగిన ధరల కారణంగా దుర్భర జీవితం గడిపే పరిస్థితి తలెత్తిందన్నారు. కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ తలపెట్టిన ఆందోళనలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మహేశ్, హరిబాబు, గోపాల్, కృష్ణ, నిజాముద్దీన్, హనీఫ్, తిరుమల్, ఉప్పేరు నర్సింహ పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలందించడంలో జాప్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బాగుచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. పైకప్పు పెచ్చులూడి కిందపడుతుందని అన్నారు. చాలా గదుల గోడలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవటంతో మండలంలో ఉన్న రోగులకు వైద్యసేవలు అందడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. భగత్‌రెడ్డి, లక్ష్మన్‌గౌడ్, వీరేష్‌గౌడ్, నర్సింహులు, రఘు, రాజశేఖర్, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలి

- ఇంటి యాజమాన్యపు హక్కు పత్రాలు ఇవ్వొద్దు
- ఇన్‌చార్జి డీపీవో నాగేంద్రం



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీవో

గద్వాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి యాజమాన్యపు హక్కు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు జారీ చేయవద్దని జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి నాగేంద్రం సూచించారు. శనివారం కార్యదర్శులతో సమావేశమయ్యారు. గద్వాల మండలం లత్తిపురం, తెలుగోనిపల్లిలో పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం బయటపడటంపై సమీక్షించారు. 2021 నుంచి ఇంటి యాజమాన్యపు హక్కు పత్రాలను జారీ చేయడం లేదని కార్యదర్శులు డీపీవోకు గుర్తుచేశారు. కొందరు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వారు ఓటర్లతో కుమ్మక్కై ఇలాంటి తప్పుడు పనులకు ఆజ్యం పోస్తున్నారని వివరించారు. ఫోర్జరీకి కార్యదర్శులు బాధ్యులు కాదని వివరించారు. దీంతో ఓనర్‌షిప్ సర్టిఫికేట్లతో రిజిస్ట్రేషన్ చేయవద్దని రిజిస్ట్రార్‌కు లేఖ రాస్తామని డీపీవో తెలిపారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయాలని సూచించిందని, ప్రతి కార్యదర్శి తన పరిధిలోని దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



రవీంద్రనాథ్‌రెడ్డి(ఫైల్)

అలంపూర్ చౌరస్తా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి (34) తన తల్లి సుబ్బమ్మతో కలిసి ఉండవెల్లి మండలంలోని కలుగొట్లలో నివాసం ఉంటున్నారు. శనివారం వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్ వస్తున్న క్రమంలో అలంపూర్‌చౌరస్తా నుంచి శాంతినగర్ వెళ్లేదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఉండవెల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముందంజలో అయిజ సింగిల్‌విండో

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

అయిజ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే అయిజ సింగిల్ విండో ముందంజలో ఉందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన సమీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 78 సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు సేవలందించడమే కాకుండా సింగిల్ విండోకు లాభాలు చేకూర్చడంలో అయిజ ముందంజలో ఉందని తెలిపారు. రైతులకు రుణాలు ఇచ్చే సంస్థగా కాకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకొని బ్యాంకులకు ధీటుగా మన సింగిల్ విండోలు ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సింగిల్‌విండో చైర్మన్లు, కార్యదర్శులు, దేవన్న, భూమ్‌పూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

గద్వాల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆఫీస్ బేరర్స్ సమావేశం శనివారం పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించారు. రెండేళ్లుగా సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, పెన్షన్, టీఎస్‌జీఎల్ఐ తదితర బిల్లులు ఆగిపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గతేడాది మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాడ్యూటీ, కమ్యుటేషన్ మొత్తాలను చెల్లించకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీటన్నింటిపై తక్షణం స్పందించాలన్నారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు వాయిదాల డీఏలు ప్రకటించాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించి ఉద్యోగ సంఘాలతో చర్చించి అమలు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జీవో 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. గోపాల్, వెంకటరమణ, చక్రధర్, చంద్రకాంత్, తిలక్, రాజశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.